క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం


మోటార్‌కు మరమ్మతులు

విజయపురం (నగరి): మండలంలో ఎంఅగరం ఆది ఆంధ్రవాడ, దళిత వాడలో ఇటీవల నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ సుధాకర్ శనివారం పరిష్కరించారు. గ్రామంలో రెండు విద్యుత్ మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో తాగునీటి సమస్య నెలకొంది. వెంటనే స్పందించిన సర్పంచ్ తాగునీటి విద్యుత్ మోటార్లకు మరమ్మతు చేయించి గ్రామానికి తాగునీరు అందించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


శాలినితో ఉపాధ్యాయులు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శాలిని రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైందని శనివారం హెచ్‌ఎం మనోహర్‌నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు శాలిని ఎంపికైందని, రాష్ట్రస్థాయి పోటీల్లో శాలిని పాల్గొంటుందని పేర్కొన్నారు. శాలినిని, శిక్షణ ఇచ్చిన శివకుమార్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఏఐటీయూసీ వేడుకలను ఘనంగా జరుపుకుందాం


మాట్లాడుతున్న కోదండయ్య

నగరి : ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. శనివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ నేత నగోమి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ ఏఐటీయూసీ స్థాపించి 104 సంవత్సరాలు పూర్తిచేసుకుందన్నారు. ఈనెల 31న జిల్లా వ్యాప్తంగా జెండాలు ఎగరేసి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగరి పట్టణ సీనియర్ నేతలు వేలన్, భాష, మురళి, శేఖర్, విజయ్ కుమార్, సతీష్, చందామర్రై, విజయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన


విద్యార్థుల తలపై నీటిని పెట్రోల్‌గా మార్చి మంటను మండిస్తున్న యుగంధర్

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ విభాగ కన్వీనర్ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుగంధర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూడు ప్రశ్నల ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం కోసం నీళ్లను పెట్రోల్‌గా మార్చడం, మంటను మింగడం, తాడు ముక్కలను అతికించడం, నీటితో లింగాలు తీయడంనాలుకపై శూలం గుచ్చుకోవడం వంటి మ్యాజిక్‌లను చేశారు. వాటిలో ఉన్న మర్మాలను, సైన్స్ అంశాలను విద్యార్థులకు వివరించారు. ఎంఈఓ గిరిజ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంచడానికి ఈ వండర్ సైన్స్ కార్యక్రమం అన్నారు. హెచ్‌ఎం దీనదయాల్, ఉపాధ్యాయులు గుణశేఖర్, వాసు, శ్రీనివాసులు, మురుగదాస్, వెంకటేష్, సుబ్బు లక్ష్మి, ఆనందయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


మృతుని భార్యకు నగదు ఇస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, నేతలు

నగరి: మండలంలోని తెరణి గ్రామంలో శుక్రవారం మృతిచెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత రామమూర్తి కుటుంబసభ్యులకు జగనన్న బీమా నగదు అందజేశారు. శనివారం మృతుని ఇంటికి వెళ్లిన సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ ఏసు మృతుని భార్య మీనాక్షికి బీమా నగదు అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రియ, వలంటీర్ నిత్య పాల్గొన్నారు.

గుండెపోటుతో వైస్ ఎంపీపీ మృతి


దూది అరుణ (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని రాజా ఇండ్లు గ్రామంలో శనివారం వైస్ ఎంపీపీ దూది అరుణ గుండెపోటుతో కన్నుమూశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దూది శంకర్ సతీమణి అరుణ ఉదయం ఇంటి వద్ద అకస్మాత్తుగా స్పృహతప్పి పడి పోయారు. కుటుంబీకులు వెంటనే పెనుమూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అరుణ మరణంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పోషకాల బడి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు
- సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తాజా కూరగాయలు


పుత్తూరు అంగన్‌వాడీలోని కిచెన్ గార్డెన్,


అప్పలాయగుంటలోని కిచెన్ గార్డెన్

పుత్తూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన తాజాకూరగాయలను అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అన్నివిధాలా 'పోషణ'ను అందిస్తోంది. అయితే మార్కెట్‌లో లభించే కూరగాయల్లో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో పండించినవే అందుబాటులో ఉంటున్నాయి. వీటివల్ల దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల కార్యక్రమానికి గత ఏడాదే శ్రీకారం చుట్టింది. అవకాశం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సేంద్రియ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరలు పండించి అందజేయాలన్నదే కిచెన్ గార్డెన్ల ప్రధాన లక్ష్యం. ఫలితంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన తాజాకూరగాయాలు, ఆకుకూరలు ఇస్తున్నారు. వీరిలో పోషణ స్థాయిని పెంచి, రక్తహీనత నివారణకు కృషిచేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల బాధ్యతను అంగన్‌వాడీ కార్యకర్తలే ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తుండడం విశేషం. పుత్తూరు ఐసీడీఎస్ పరిధిలో పుత్తూరు రూరల్‌లో 43, అర్బన్‌లో 43, వడమాలపేటలో 43, మొత్తం 129 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గర్భిణులు 642, బాలింతలు 644, మూడేళ్లలోపు పిల్లలు 3,969, మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు 1,537 మంది ఉన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటలు కళకళలాడుతున్నాయి.

అంగన్‌వాడీలే కర్షకులు..

అంగన్‌వాడీ కార్యకర్తలే కర్షకులుగా కిచెన్ గార్డెన్లను నిర్వహిస్తున్నారు. కేంద్రాల వద్ద గల ఖాళీ స్థలాల్లో ఆకుకూరలు, కూరగాయలను కార్యకర్తలే సాగు చేస్తూ ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. బెండ, వంగ, మిర్చి, టమాట, బీర, సార వంటి కూరగాయలతో పాటు పాలకూర, మెంతి, చుక్క, తోట ఆకు కూరలను సాగుచేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అందరి సహకారంతోనే..



పుత్తూరు ఐసీడీఎస్ పరిధిలో 129 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అవకాశం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ కిచెన్ గార్డెన్‌ను నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం అందరి సహకారంతో ముందుకు సాగుతోంది. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త ఆసక్తిగా నిర్వహించడం సంతోషించదగ్గ విషయం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాజాకూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నాం. గర్భిణులకు, బాలింతలకు ఇస్తున్నాం.

– కె.పద్మజ, సీడీపీఓ, పుత్తూరు

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు


హోమ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

నగరి: మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో టీటీడీ అనుబంధ కరివరదరాజ ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని శుద్ధిచేశారు. శ్రీదేవిభూదేవి సమేత కరివరదరాజస్వామిని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు, వైదిక కార్యక్రమాలు చేశారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పవిత్రాలను కట్టారు. ఆలయంలో సంవత్సరం పొడవునా పలు క్రతువుల్లో ఉత్సవాల్లో తెలిసీతెలియక జరిగిన దోషాల నివారణకు ప్రతి ఏడాది పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వేదపండితులు తెలిపారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పవిత్రోత్సవంలో మంత్రి ఆర్కే రోజా

నగరి : మున్సిపల్ పరిధి సత్రవాడ కరివరదరాజ స్వామి ఆలయంలో నిర్వహించిన పవిత్రోత్సవంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం ప్రాథమిక, అంత, సర్కార్ సంకల్ప హోమం అంటూ పూర్ణ యాగంలో పాల్గొన్న ఆమె కరివరదరాజ స్వామిని దర్శించుకున్నారు. వేద పండితులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, జగన్, అయ్యప్ప పాల్గొన్నారు.


పవిత్రోత్సవాల్లో మంత్రి ఆర్కేరోజా

ప్రజల ఆరోగ్యమే సురక్ష లక్ష్యం


వెజ్జుపల్లిలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గంగాధర నెల్లూరు: మండలంలోని వెజ్జుపల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ శ్రీదేవి ప్రారంభించారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు అందజేశారు. వైద్యులు షర్మిల, కుమార్ రాజా, నోయల్, శాలిని, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, డీటీ తులసీరామ్, సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, నేతలు నాయనిరెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక భూపతిరాజు కుటుంబసభ్యులు శనివారం వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకొని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు.

జాబ్‌కార్డుదారులు అందరికీ పనులు

పూతలపట్టు: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులను కల్పించాలని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం అధికారులు 'సామాజిక తనిఖీ ప్రజావేదికను' నిర్వహించారు. డ్వామా పీడీ గంగాభవాని హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల కల్పనలో పూతలపట్టు జిల్లా స్థాయిలో వెనుకబడిందన్నారు. అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమష్టిగా పనిచేసి ముందుకు తీసుకెళ్లాలన్నారు. జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికే పాలవెల్లువ


మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

కార్వేటినగరం: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పాలవెల్లువ పథకం అభివృద్ధికి మహిళలు సహకరించాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పాలవెల్లువ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాలవెల్లువ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అందులో ప్రతి మహిళ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసే పాల కేంద్రాలకు అత్యధికంగా పాలను సరఫరా చేయాల్సిన అవసరం మహిళలపైనే ఉందన్నారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం రుణసౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. జగనన్న పాలవెల్లువను విజయవంతం చేయడానికి వలంటీర్లు, సంఘమిత్రలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ, ఏపీఎం విజయకుమార్, పశువైద్యాధికారి హేమాద్రి, ఈఓ పీఎస్ మణి పాల్గొన్నారు.

అందరినీ రక్షించు సదాశివా!


పుత్తూరు ఈశ్వరాలయంలో మంత్రి రోజా

పుత్తూరు రూరల్: అందరనీ సదా రక్షిస్తూ, చల్లగా చూడాలని కామాక్షీ సమేత సదాశివేశ్వరుడిని వేడుకున్నట్లు మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శనివారం రాత్రి ఆలయంలో నిర్వహించిన అన్నాభిషేకం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌బాబు, సభ్యులు రమేష్, సుందరం, బాబు, రుక్మిణి, విజయలక్ష్మి, భరణి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి, ద్రౌపదీదేవి, ఆరేటమ్మ ఆలయాల కమిటీ చైర్మన్లు లారీ మోహన్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వరునికి రుద్రాభిషేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వరస్వామికి పౌర్ణమి పురస్కరించుకుని శనివారం రుద్రాభిషేక పూజలు, యాగశాల పూజలు చేశారు. ఉదయం భక్తులు యాగశాలకు కావలసిన పూజా సామగ్రిని గ్రామాల్లో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. వేద పండితులు నవగ్రహ, శాంతి హోమం వంటి యాగశాల పూజలు చేశారు. హోమం నిర్వహించిన కలశ నీటితో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ విద్యావతి

పాలసముద్రం: జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరలో పూర్తిచేయాలని ఏఓ విద్యావతి, మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. శనివారం హౌసింగ్ ఏఈ దాము సమక్షంలో మండల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి పక్కా భవనం ఉండాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసిందని అన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

31న చేపల చెరువు వేలం


వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు పంచాయతీ పరిధిలోని బుచ్చిరెడ్డికండ్రిగ చెరువులో చేపల పెంపకం కోసం ఈనెల 31న వేలం పాట నిర్వహిస్తున్నట్లు డీడీఓ మోహన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో ఆయన వివరిస్తూ ఆళ్లమడుగు రచ్చబండ వద్ద 31వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు రూ.12,500 చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.50 వేలకు పైగా చెరువును పాడుకోవాలని తెలిపారు. వేలం పాటలో చెరువును దక్కించుకున్న వారు 3శాతం అదనంగా స్టాంప్ డ్యూటీ చెల్లించాలని తెలిపారు. ఆళ్లమడుగు, దిగువపల్లాలు, ఎనమలమంద పంచాయతీకి చెందిన ప్రజలు వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9581303118, 9902722262 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సామాజిక అభివృద్ధిపై శిక్షణ


మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ పురుషోత్తం

వెదురుకుప్పం: స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఎంఎస్‌ఈసీ, సంఘమిత్ర సభ్యులకు గ్రామ అధికార పునరుద్ధరణ(వీపీఆర్‌పీ)కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ పురుషోత్తం మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వారు గ్రామ స్థాయిలో జరిగే సభల్లో ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. ప్రధానంగా హక్కులు, జీవనోపాధులు, ప్రభుత్వ ఆస్తులు, సేవలు, వనురుల అభివృద్ధి, సామాజిక అభివృద్ధి ప్రణాళికలపై తర్ఫీదు కావాలన్నారు. డీపీఎంబీ వెంకటేశ్, ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

అప్పలాయగుంట ఆలయానికి తాళం


మూసివేసిన ఆలయ ప్రధాన ద్వారం

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం మూసివేశారు. చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని మూసివేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు ఏకాంత శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

అర్ధగిరి ఆలయం మూసివేత


ఆలయాన్ని మూసివేస్తున్న ఆలయ అర్చకులు

తవణంపల్లె: చంద్రగ్రహణం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి శనివారం సాయంత్రం ఆలయ అర్చకులు మూతవేశారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రగ్రహణం సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు, సుదర్శన హోమం, ప్రాకారోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ అధికారులు రద్దు చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని మూతవేసి తర్వాత ఆలయ శుద్ధి చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.